# ప్రజాబంధు వడ్డే శోభనాద్రి

(జీవన సంగ్రహం)



వడ్డే శోభనాద్రీశ్వర రావు



# ప్రజాబంధు వడ్డే శోభనాద్రి గారు

## చిన్న వయస్సులోనే గ్రామ పెత్తందారు బాధ్యత:

**మా** తాతగారు వడ్డే శోభనాద్రిగారి తండ్రి శ్రీ రాములు గారు. ఆయన కృష్ణాజిల్లా గుడివాడ తాలూకా యలమర్రు గ్రామ పెత్తందారు. యలమర్రు నూజివీడు ఎస్టేట్‌లోని గ్రామము. యలమర్రు జమీందారు గారు నూజివీడులో, మద్రాసులో ఉండేవారు. శ్రీరాములు గారి భార్య పున్నమ్మ గారు. శ్రీరాములు గారికి శోభనాద్రి గారితో పాటు సీతమ్మ అను కుమార్తె కలదు. శోభనాద్రి గారి చిన్న వయస్సులోనే తండ్రి గారు కాలంచేయడంతో గ్రామ పెత్తందారు బాధ్యత మీద పడింది. అప్పటి నుంచి గ్రామంలో ఎవరిమధ్యనైన భేధాభిప్రాయాలు ఏర్పడినప్పుడు ఓర్పుగా, నేర్పుతో పరిష్కరిస్తూ ఉండటం అలవాటయ్యింది. ఇదే ధోరణిని ఆయన జీవితాంతం అనుసరించారు. స్వభావరీత్యా ఆయన శాంతి కాముకుడు. గ్రామాల్లోని ప్రజలు తగాయిదాలు లేకుండా ప్రశాంతంగా జీవించాలనేదే ఆయన భావన. వంద ఎకరాల వ్యవసాయాన్ని ఉయ్యూరులో వడ్డే సుబ్బయ్య, కడవకొల్లులో కోడూరి అంకినీడు, రామయ్యలు, మర్రివాడలో సాయిబు యలమర్రులో, వెంకన్న చేయించుతూ ఉండేవారు.

**కలిసిఉంటేనే కలదు సుఖం:**

మా తాతగారు ఆయన జీవిత కాలంలో ఎక్కువ భాగం పలు గ్రామాలలో తగాయిదాలు లేక కొట్లాటలు సంభవించిన సందర్భాల్లో వాళ్లలో ఎవరోఒకరు సాధారణంగా తాత గారి దగ్గరికి రావడం, ఈయన వెళ్లి పంచాయితీ చేసి రాజీ చేస్తూ ఉండేవారు.

భార్య భర్తల మధ్య విభేదాలు తలెత్తి విడిపోవాలి అనుకున్నా ఆయనకు తెలిస్తే వెళ్ళి ఉభయులతోను ఎందుకు విడిపోవాలని అనుకుంటున్నారో కారణాలు తెలుసుకుని లౌక్యంగా వారిని తిరిగి కలిపి ఉంచే దానికి ప్రయత్నిస్తూండేవారు. ఈ విషయాల్లో కృష్ణా జిల్లాలో ఆయన పేరు పొందారు.

**నడకే - నడక**

అతి సాధారణమైన జీవితం గడిపారు. ఉతికిన ముతక ఖద్దరు బట్టలు ధరిస్తూండేవారు. సిగిరెట్ గాని, మద్యం గాని, పేకాట గాని ఎటువంటి దురలవాట్లు లేని వ్యక్తి. యలమర్రు గ్రామానికి ఆరోజుల్లో బస్ సౌకర్యం లేనందున ఆయనకు కాలినడక బాగా అలవాటు అయ్యింది. గుడివాడ , ఉయ్యూరు, పెదమద్దాలి, కుర మద్దాలి, పామర్రు ఎక్కడికి వెళ్లాలన్నా నడచే వెళ్తూవుండేవారు. విజయవాడ వెళ్ళినా రిక్షా ఎక్కేవారు కాదు. ఒకసారి నేను హైస్కూల్లో చదువుతుండగా మద్రాసు ఆయనతో వెళ్లటం జరిగింది. ఈ రోజుల్లో వలె సూట్కేస్లు పెద్దగా ఉండేవి కావు. రైల్లో చెక్క బెర్తులే అందువల్ల చిన్న సైజు బెడ్డింగ్ తీసుకు వచ్చారు. మద్రాసు సెంట్రల్ స్టేషన్ నుండి వెలగపూడి రామకృష్ణగారు ఉండే సుందరమహాల్ బంగ్లాకు నడిచే వెళ్లాం. నేను బెడ్డింగ్ మోయ్యాల్సి వచ్చింది. రిక్షా ఎక్కుదాం తాతయ్య అంటే "ఎందుకురా దగ్గరేరా దగ్గరేరా" అంటూ నన్ను అక్కడదాక నడిపించుకునే వెళ్లారు. ఆయన విందులు, వినోదాలు, అనవసరపు ఖర్చులను వ్యతిరేకించేవారు.

**త్రిమూర్తులు - అడుసుమిల్లి - వడ్డే - కోగంటి**

గుడివాడ తాలూకా సిద్ధాంతం గ్రామానికి చెందిన పెద్ద రైతు అడుసుమిల్లి గోపాలకృష్ణయ్య, పెద్దమద్దాలి గ్రామ వాస్తవ్యుడు కోగంటి వెంకట్రామయ్య






గార్లతో మాతాత గారికి సన్నిహిత స్నేహ బంధం ఎర్పడింది. మా తాత గారికి వెంకట్రామయ్య గారికి చెరి అణాముక్కాని వాటా కాగా మిగతాది గోపాలకృష్ణయ్య గారిది. రంగాపురం ఎస్టేట్‌కు చెందిన భూములను వీరు కొన్నారు. ఆ క్రమంలో ఉయ్యూరులో నివాసం కొనసాగించారు.

ఆనాటికి సమాజంలో బ్రాహ్మణేతర వర్గాలు విద్య, ఉద్యోగాలలో వెనుకబడి ఉన్నారు. అందువలనే జస్టిస్ పార్టీ ఆరోజుల్లో కొంతమేరకు ప్రజల్లో పరపతిని సంపాదించింది. వీరు ముగ్గురు జస్టిస్ పార్టీకి మద్దతు ఇస్తూ ఉండేవారు. ఆ క్రమంలోనే చల్లపల్లి రాజా యార్లగడ్డ శివరామ ప్రసాద్ గారితో కూడ సన్నిహిత సంబంధం ఏర్పడింది. చివరి వరకు ఆ సంబంధం కొనసాగింది.

స్థానిక సంస్థల ఎన్నికలలో తాను కాకాని వెంకటరత్నం గారితోను, మా మేనత్త కొడాలి అనసూర్యావతి గారు గొల్వేపల్లి వాస్తవ్యురాలు స్వాతంత్ర్య సమరయోధురాలు వల్లభనేని సీతామహాలక్ష్మమ్మ గారితోను పోటీ చేసి ఓడిపోవడం జరిగింది. అందువలనే నాలో చిన్న వయస్సు నుండి కాంగ్రెసు వ్యతిరేక భావాలు నాటుకున్నాయి.

## గుడివాడ కాలేజీ స్థాపన

అప్పట్లో బందరు, విజయవాడలో మాత్రమే కాలేజీలు వున్నాయి. గుడివాడ ప్రాంతంలో కూడ ఉన్నత విద్యను అభ్యసించే అవకాశం కలిగించాలి అనే ఉద్దేశ్యంతో ఆ ప్రాంత ప్రముఖులు పర్వతనేని వెంకటరత్నం, కాజా



*గుడివాడ కాలేజీ వ్యవస్థాపకులు శ్రీయుతులు పర్వతనేని వెంకటరత్నం, కాజా వెంకట్రామయ్య, వడ్డే శోభనాద్రి, ఉపద్రష్ట పాపన్న శాస్త్రి, వేములపల్లి రామబ్రహ్మం, ఉప్పలపాటి వీరభద్రరావు, లింగం వెంకట కృష్ణయ్య గార్లు*

వెంకట్రామయ్య, ఉపద్రష్ట పాపన్న శాస్త్రి, లింగం వెంకట కృష్ణయ్య, ఉప్పలపాటి వీరభద్రరావు, వేములపల్లి రామబ్రహ్మం గార్లతో కలిసి మా తాత గారు ఆంధ్రా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా ఉన్న వి.ఎస్. కృష్ణ గారిని కలిసి గుడివాడలో కాలేజీ ప్రారంభించేందుకు అనుమతిని పొందేందుకు కృషి చేశారు.



*గుడివాడ పాత కాలేజీ భవనము*



భూషణగుళ్ల వద్ద ఎ.ఎన్.ఆర్. కాలేజీ నూతన భవనము

ఆ సందర్భంగా రూ. 50 వేలు కార్పస్ ఫండ్‌గా డిపాజిట్ చేయవలసి వచ్చింది. రూ. 17 వేలు తగ్గగా మా తాత గారు కోలవెన్ను గ్రామంలో మా బంధువులైన అడుసుమిల్లి వారి కుటుంబం వద్ద ప్రో నోటు వ్రాసి తీసుకుని కాలేజీకి



యెర్నేని చలమయ్య ఆడిటోరియం



కొల్లి లింగయ్య జిమ్‌నేషియమ్



లైబ్రరీ భవము



ఎ.ఎఫ్. త్యాగరాజు



డా॥ వై. వెంకటేశ్వరరావు




ఎ.ఎన్.ఆర్. కాలేజీ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల సందర్భంగా ముఖ్యమంత్రి మరియు ఎ.ఎన్.ఆర్.లతో



ఎ.ఎన్.ఆర్. కాలేజీ ఫౌండర్స్ డే సందర్భంగా

అందజేశారు. మొదట్లో గుడివాడలో మెయిన్‌రోడ్ ప్రక్కన వల్లూరుపల్లి వారి భవనంలో కాలేజీ ప్రారంభం అయ్యింది. 1960లో నేను బి.ఎస్.సి. మొదటి సంవత్సరం అక్కడే చేరాను.

అనంతర కాలంలో అక్కినేని నాగేశ్వర రావుగారు కాలేజీకి సహకారం అందించడం, భూషణగుళ్ల, పెదపారుపూడి మున్నగు గ్రామాల వారు సుమారు 14 ఎకరముల భూమిని రూ. 1 లక్ష నగదును సేకరించి, చక్కని నూతన భవనమును భూషణగుళ్ల సమీపంలో నిర్మించారు. యు.జి.సి. నిధులకు తోడు మా కాలేజీలో కెమిస్ట్రీ లెక్చరర్ కె.జి.కె. ప్రసాదరావు గారి కుటుంబం, పూర్వ విద్యార్థులైన ఈనాడు అధిపతి చెరుకూరి రామోజీరావు, రాజ్యసభ సభ్యుడు డా॥ వై. లక్ష్మీ ప్రసాద్, యార్లగడ్డ నాగేశ్వర రావు, మాగంటి మధుసూధన్ రావు, పునుకొల్లు భద్రాచలం గారి కుటుంబం మున్నగు మరెందరో దాతల సహకారంతో ఎ.ఎన్.ఆర్. కాలేజీకి అన్ని కోణాల్లో మౌలిక వసతులు సమకూరాయి. యెర్నేని చలమయ్య ఆడిటోరియం, కొల్లి లింగయ్య జిమ్నేషియం, లైబ్రరీ, విద్యార్థులకు హాస్టల్ బిల్డింగ్ మున్నగు పలు సౌకర్యాలు ఎర్పాటు చేయబడ్డాయి.

ప్రముఖ విద్యావేత్తలు ఎ.ఎఫ్. త్యాగరాజు గారు మొదటి ప్రిన్సిపాల్‌గా తరువాత డా॥ యర్నేని వెంకటేశ్వరావులు కాలేజీ అభివృద్ధికి చక్కని కృషి చేశారు. మా తాత గారు తాను అప్పు చేసి కాలేజీకి డిపాజిట్ చేయుట కొరకు ఇచ్చిన ధనాన్ని ఆయనకు తిరిగి ఇవ్వలేదు. ఈయనకు గట్టిగా అడిగే స్వభావం లేదు. శోభనాద్రి గారు కాలేజీ మేనేజింగ్ కమిటీలో జీవితకాల సభ్యుడిగా ఉన్నారు. ఆయన తదనంతరం కాలేజీ కమిటీ కార్యదర్శి పర్వతనేని నాగేశ్వరరావు, కరస్పాడెంటు కాట్రగడ్డ సింహాద్రి అప్పారావుల కోరికపై నేను కమిటీ సభ్యునిగా కొనసాగుతున్నాను.

**ఉయ్యూరులో షుగర్ ఫ్యాక్టరీ స్థాపన:**

గోపాలకృష్ణయ్య గారి అల్లుడు వెలగపూడి రామకృష్ణ ఐ.సి.యస్ గారు మద్రాస్ రాష్ట్ర ప్రభుత్వంలో ఇండస్ట్రీస్ డైరక్టర్‌గా ఉన్నారు.వారి సలహాతో ఉయ్యూరులో షుగర్ ఫ్యాక్టరీ ఎర్పాటు అయ్యింది. అడుసుమిల్లి గోపాలకృష్ణయ్య గారు, మా తాత శోభనాద్రి గారు, కోగంటి వెంకట్రామయ్య గారు కాజా ఉమామహేశ్వరరావు, అనుమోలు రాఘవరావు వల్లభనేని వెంకట కృష్ణయ్య,



ఉయ్యూరులో కె.సి.పి. షుగర్ ఫ్యాక్టరీ

పాలడుగు నాగేశ్వర దాస్ మున్నుగు వారు ప్రధానపాత్ర పోషించగా రామకృష్ణ గారు పై నుండి అవసరమైన సహాయ సహకారాలను అందించారు. మెదట్లో అనుకున్న దానికన్నా ఫ్యాక్టరీ ప్రారంభం అలస్యం కావడం, చెరకు పంచదార దిగుబడి, నాణ్యతలలో తగ్గుదల వలన ఫ్యాక్టరీకి, రైతులకు కొన్ని ఇబ్బందులు ఎదురయ్యాయి. ఆ సమయంలో చల్లపల్లి రాజా గారు ఆదుకొన్నారు. ముందు సహకార చెక్కర ఫ్యాక్టరీగా ప్రారంభమై దరిమిలా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా మారింది.



రామకృష్ణ గారు, వారి బిడ్డలు వి.యం.రావు, వి.యల్.దత్, పి.రాజేశ్వరి రామకృష్ణన్‌ల ఆధ్వర్యంలో కె.సి.పి సంస్థ బ్రహ్మాండంగా అభివృద్ధి చెందింది. మాచర్ల వద్ద సిమెంట్ ఫ్యాక్టరీ, కొవ్వూరు వద్ద షుగర్ ఫ్యాక్టరీ, నిడదవోలు వద్ద సూపర్ ఫాస్ఫేట్ ప్లాంట్, తిరువత్తియూర్‌లో వర్క్ షాపులను ఏర్పరిచారు ముందునుండి కె.సి.పిలో గణనీయంగా షేర్లువున్నా డైరక్టర్ షిప్ కావాలని మా తాత గారు పట్టుపట్టిన మనిషి కాదు.








వెలగపూడి రామకృష్ణ గారు డా॥ వి.ఎల్. దత్ గారు శ్రీమతి ఇందిరా దత్ గారు

**బల్లిపఱ్రు లాకు ఏర్పాటు:**

అప్పట్లో మా తాతగారు ఇరిగేషన్ డిపార్టుమెంట్ వారితో సన్నిహితంగా ఉండేవారు. ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి పుల్లేరు కాల్వపై పామఱ్రు సమీపంలోని బల్లిపఱ్రు వద్ద లాకును నిర్మింప చేశారు. దాని ఫలితంగా పామఱ్రు, పెద్దమద్దాలి, జమిగొల్వేపల్లి, యలమఱ్రు పరిసర గ్రామాల్లోని 70 వేల ఎకరాలకు సాగునీటి సౌకర్యం లభించింది. యలమఱ్రు గ్రామానికి కూడా కాలువనీటి సదుపాయం కల్పించే అవకాశం ఏర్పడింది. "శోభనాద్రిగారూ! మన గ్రామ భూములకు ఉపయోగపడే విధంగా పుల్లేరు నుంచి కాలువ తవ్వించండి. అందుకయ్యే ఖర్చు నేనిస్తాను" అని జమీందారుగారు అన్నారట. శోభనాద్రిగారు ఈ



పామర్రు సమీపంలో బల్లిపర్రు వద్ద శోభనాద్రిగారి చొరవతో నిర్మించబడిన లాకు

తవ్వకం పనుల గురించి శ్రీకాకుళంజిల్లా ప్రాంతంవారిని రప్పించి యలమర్రు గ్రామంలో మా తాతగారి మెట్టభూమిలో వారు ఇళ్ళు నిర్మించుకునే అవకాశం కల్పించి కాలువలు తవ్వించారు. జమీందారుగారిని ఖర్చయిన మొత్తాన్ని ఇవ్వమని అడగ్గా, ఆయన "శోభనాద్రిగారూ! యలమర్రులో మా భూములున్నాయిగదా! భూములిస్తాను, రాయించుకోండి!" అన్నారట. అప్పటికే మా తాతగారు అడుసుమిల్లి గోపాలకృష్ణయ్యగారు, కోగంటి వెంకట్రామయ్యగార్లతో కలసి రంగాపురం ఎస్టేట్ భూముల్ని కొనివున్నారు. ఉయ్యూరులో షుగర్ ఫ్యాక్టరీని స్థాపించారు. "ఉన్నప్పుడు డబ్బే ఇద్దురుగాని, నాకు భూములు వద్దులెండి" అని శోభనాద్రిగారు చెప్పారట. ఎన్నో సంవత్సరాలు గడచిపోయినా జమీందారుగారు శోభనాద్రిగారికి డబ్బు ఇవ్వలేదు. ఈయన గట్టిగా అడిగే మనిషికాదు.

**యలమర్రులో కమ్యూనిష్టులపై పోలీసుల దాష్టీకం:**

పలనియప్పన్ అను పోలీసు ఉన్నతాధికారి ఆదేశాలతో మాధవరావు అనే పోలీసు అధికారి యలమర్రు గ్రామంలో కమ్యూనిష్టు సానుభూతి పరులను నగ్నంగా గ్రామంలో తిప్పిన సంఘటన అప్పట్లో సంచలనం కలిగించింది. గరికపాటి కృష్ణారావు, మోటూరి సీతారామ బ్రహ్మం, సుంకర చంద్రమౌళేశ్వర రావు మున్నగు కమ్యూనిష్టు నాయకులను దృష్టిలో ఉంచుకుని యలమర్రు గ్రామంపై ఈ దాడి జరిగింది.

**ఏడుగురు ఎమ్మెల్యేలు యలమర్రు వారే!**


ముదినేపల్లి ఎమ్.ఎల్.ఎ.గా చేసిన బొప్పన హనుమంతరావు, చిలకలూరిపేట ఎమ్.ఎల్.ఎ.గా చేసిన డా. కాజా కృష్ణమూర్తి, ఉయ్యూరు




బొప్పన హనుమంతరావు



కె.వి. నారాయణ రావు



కొడాలి శ్రీ వెంకటేశ్వర రావు (నాని)



వడ్డే శోభనాద్రిశ్వర రావు



అన్నే బాబురావు, శ్రీమతి అన్నే విజయలక్ష్మి

ఎమ్.ఎల్.ఎ.గా చేసిన అన్నే బాబురావు, అన్నే విజయలక్ష్మి, సిర్పూర్ కాగజ్‌నగర్ ఎమ్.ఎల్.ఎ.గా చేసిన కె.వి. నారాయణ రావు, గుడివాడ ఎమ్.ఎల్.ఎ. కొడాలి నాని, నాతో సహా ఏడుగురు శాసనసభ్యులం యలమర్రు వారిమే.

**ఎందరో విద్యాధికులు**

1947లోనే యలమర్రులో మిడిల్ స్కూల్ ఏర్పాటు అవడం వలన గ్రామంలో అనేక మంది ఉన్నత విద్యను అభ్యసించారు. డా॥ ఎస్. వినయ్‌బాబు, డా॥ వెనిగళ్ల చంద్రమోహన్, డా॥ కొడాలి వెంకట సుబ్బారావు డా॥ కాజ రామారావులతో సహా దాదాపు ఇరవై మంది డాక్టర్లు,కొడాలి వెంకటరత్నం,సుంకర అప్పారావు, జీ.వీ.అప్పారావులతో దాదాపు డెభై మంది ఇంజనీర్లు, పారిశ్రామికవేత్తలు శిరిపురపు కుటుంబరావు, సుంకర చంద్రమౌళీశ్వరరావు మున్నగు వారు యలమర్రు వారే. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు గద్దె లింగయ్య గారిది ఈ ఊరే.

మా తాతగారి మేనల్లుడు శిరిపురపు సత్యనారాయణ గారు కాంగ్రెసు పార్టీలో ఉండేవారు.గ్రామంలో మా తాత గారిది పెద్ద పార్టీ, మేనల్లుడిది చిన్నపార్టీ అనేవారు.ఒక పర్యాయం వీరిద్దరు గ్రామంలో లేని సమయంలో ఇరు పార్టీలకు చెందిన వారు కొట్టుకున్నారు విషయం తెలియగానే మా తాత గారు గాయపడినవారు వున్న హాస్పటల్‌కి వెళ్ళి అందరినీ పరామర్శించారట.

**వంతెన కడితే దుబార ఖర్చులు పెరుగుతాయి:**

మా తాత గారు గ్రామ ప్రసిడెంటుగా ఉండగా యలమర్రు గ్రామాన్ని

అనుకుని ఉన్న గండికోడుపైన వంతెన నిర్మించితే బాగుంటుందని గ్రామస్తులు కోరినప్పుడు ఆయన వంతెన పడి బస్సులు వస్తే అవసరం ఉన్నా లేకపోయినా మనవాళ్లు గుడివాడ, పామర్రు పట్టణాలకు వెళ్లి క్లబ్‌లకు, వైన్‌షాపులకు, సినిమాలకు, కులసా కాలక్షేపాలకు అనవసరంగా ధనాన్ని దుర్వినియోగం చేసుకుంటారని సహకరించలేదు. ఇప్పుడు గుడివాడ, పామర్రు, విజయవాడల నుండి రోజుకు ఆరు ట్రిప్పులు ఆర్.టి.సి. బస్సులు తిరుగుతున్నాయి. ఇవి కాక పదుల సంఖ్యలో ఆటో, టాక్సిలు తిరుగుతున్నాయి. పంచాయితీ రోడ్ల పనులు చేసేటప్పుటు గ్రామస్తుల రెండెడ్ల బండ్లకు పంచాయితీ పని కాబట్టి కొద్దిగా తక్కువ బాడుగ తీసుకోవాలని అంటుండేవారట. పంచాయితీకి లక్ష రూపాయాలు నిల్వచేసి దిగిపోయారు.

అందరినీ ఆప్యాయతతో "ఒరేయ్ అబ్బాయ్" అని సంబోదిస్తూ ఉండేవారు. అది గర్వంతో, అతిశయంతో మాట్లాడేది కాదు. అది ప్రేమ, వాత్సల్యంతో కూడుకొన్నది. నాకు తెలిసిన మేరలో వెలగపూడి రామకృష్ణ గారిని ఎ.ఎఫ్ త్యాగరాజు గారిని మాత్రమే ఎమండీ అని సంభోదించేవారు.

కృష్ణా జిల్లా రైతు సంఘానికి మా తాత గారు అధ్యక్షులు గాను ముక్కామల నాగభూషణం గారు కార్యదర్శిగాను కృషి చేశారు. విజయవాడలో ఆలపాటి వెంకటేశ్వరరావు అనే వ్యాపారి జనప విత్తనాలను బ్లాక్ మార్కెట్‌లో అమ్ముతున్న విషయాన్ని అధికారులకు తెలియపరిచారు.

**ముత్తాత శ్రీరాములు గారు- పువ్వుల వరలక్ష్మి గారు**

మా ముత్తాత శ్రీరాములు గారు పువ్వుల వరలక్ష్మి అను మహిళను ఉంచుకున్నారు. యలమర్రులోనే ఆవిడను కూడ ఉంచారు. యలమర్రులో వడ్డే ఇంటిపేరు వారి సంఖ్య ఎక్కువ. వరలక్ష్మి గారికి నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఒకవేళ తాను పోయిన దరిమిలా వరలక్ష్మి కుటుంబంనకు ఇబ్బంది కలుగుతుందేమోననే భావనతో సమీపంలోని ముదునూరు గ్రామంలో ఆవిడకు ఒక ఇల్లు, 20 ఎకరముల భూ వసతిని ఏర్పాటు చేశారు. ఐతే శోభనాద్రి గారు ఆ కుటుంబం పట్ల ఎంత మాత్రము క్రోధము గాని ఈర్ష్య గాని లేకుండా తన సొంత సోదరుల వలనే భావించేవారు. వారు కూడ తమ

కుటుంబంలలో శుభకార్యముల సందర్భములలో శోభనాద్రిగారిని ఆహ్వానించి ఎంతో గౌరవంగా ప్రేమపూర్వకంగా వ్యవహరిస్తుండేవారట. వారిలో ఒకరు డిప్యూటి కలెక్టర్‌గా చేసి రిటైర్డ్ అయ్యారు. కొందరు కాంట్రాక్టర్లు అయ్యారు. వీరిలో ఎక్కువ మంది ఖమ్మంలో స్థిరపడ్డారు.

**మా కుటుంబం - బంధువర్గం:**

మా నాయనమ్మ శ్రీ రామమ్మ గారిది యలమర్రు ప్రక్కనే చినపారుపూడి గ్రామం. మునసబు కొడాలి వీరభద్రరావుగారి తోబుట్టువ. మా తాత గారికి మా మేనత్త అనసూర్యవతి, పెదనాన్న శ్రీ రాములు గారు, మా నాన్న అంకయ్య



గారు సంతానం. మేనమామ అయిన కొడాలి గోపాలరావు గారికి మామేనత్తను ఇచ్చి వివాహం చేశారు. మా పెద్దమ్మ సీతారామమ్మ గారు గుంటూరు జిల్లా పొన్నెకల్లుకు చెందిన కొఠారు రాఘవయ్య గారి కుమార్తె. మా అమ్మ కలువపాములకు చెందిన వెల్లంకి కుటుంబయ్య గారి కుమార్తె.

మా పెదనాన్న శ్రీరాములు గారికి ముగ్గురు కుమారులే. డా॥ వడ్డే సత్యసాయి ప్రసాద్ చాలా కాలంగా అమెరికాలో స్థిరపడ్డారు. వడ్డే శివరామప్రసాద్ (బుజ్జి) ఇటీవల కాలం చేశారు. బుజ్జి కుమారుడు పవన్ గుంటూరులో




స్థిరపడ్డారు. వడ్డే హరిబాబు మిలటరీలో చేసి రిటైర్డ్‌మెంటు తీసుకుని రాజస్థాన్‌లో ఉంటున్నారు. మా నాన్న గారికి కూడ ఇద్దరు కుమారులే నేను మా తమ్ముడు కుటుంబ భాస్కరరావు. మా మాతమహులు వెల్లంకి కుటుంబయ్య గారు మా తమ్ముడిని దత్తత తీసుకున్నారు. మా కుమార్తె వెంకటలక్ష్మి అన్నపూర్ణను కొడాలి





మల్లికార్జున రావుతో వివాహం జరిపాము. వారి ఏకైక కుమార్తె గీతను కరణం బలరామ్ గారి కుమారుడు వెంకటేష్ బాబుకు ఇచ్చి వివాహం జరిపాము. మా కుమారుడు వెంకట అంకినీడు ప్రసాద్‌కు అక్కినేని సేతు రామారావు గారి కుమార్తె శ్రీ విద్యను చేసుకున్నాము.



మా మేనత్త గారికి అన్నపూర్ణ మరియు విజయలక్ష్మి అను కుమార్తెలు కొడాలి శోభానాద్రి అను కుమారుడు కలరు. ముగ్గురు కాలం చేశారు. శోభనాద్రి కుమారుడు శ్రీనివాస్ విశాఖపట్నంలో వ్యాపారంలో స్థిరపడ్డాడు. శ్రీనివాస్‌కు మా బుజ్జి కుమార్తె ప్రశాంతిను ఇచ్చి వివాహం చేశాము.

విజయవాడలో కాట్రగడ్డ పిచ్చయ్య గారి సత్యవతి, కొమ్ముమూరుకు చెందిన రామినేని వెంకటక్రిష్ణయ్య గారి భార్య రమణమ్మ గార్లు మా తాత గారి మేనకోడళ్ళు. మలినేని కోటయ్య చినపారుపూడి, వెల్లంకి వీరయ్య కాటూరు,








అడుసుమిల్లి నాగయ్య కోలవెన్ను, సుంకర రాజయ్య పొనుకుమాడు గార్లు మా తాతగారి తోడల్లుళ్లు.





గండిగుంట దత్తాశ్రమంలో వడ్డే శోభనాద్రి హాల్



ఉయ్యూరు ఎ.జి., యస్.జి., సిద్ధార్థ కళాశాలలో శ్రీ వడ్డే శోభనాద్రి
యు.జి.సి. స్పాన్సర్డ్ మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం

# మిత్రులూ - నేనూ

(గ్రంథం నుండి)

- శ్రీగొర్రెపాటి వెంకటసుబ్బయ్య

## శ్రీవడ్డే శోభనాద్రి

"మన మింతవరకు రైతులసంగతి గమనించనే లేదు. భోజనానికి మనము వారిపై ఆధారపడి వుండికూడా ఇంతవరకు మనమే వారికి ఆశ్రయదాతలమని, వారు ఆశ్రితులని అనుకున్నాము. యదార్థం మనం ఆలోచించనే లేదు."

-బాపూ.

ఆంధ్ర దేశములో సంఘ సంస్కరణకు వీరేశలింగంగారు, ధార్మిక, నైతిక జీవితమునకు వెంకటరత్నం నాయుడుగారు, మరుపునకు రానట్టే రాజకీయంలో ఆంధ్రభీష్మ న్యాపతి సుబ్బారావుగారు. గంజాం వెంకటరత్నంగారు, మోచర్ల రామచంద్రరావుగారు వీరుభయులు న్యాయవాదులైయ్యు శాసనసభలలోనూ. బైటను రైతాంగ సేవకై కంకణం దాల్చిన ప్రసిద్ధులు. అందులో రామచంద్రరావు గారు భూమితనఖా బ్యాంకును స్థాపించి రైతులకు అండగా నిలిచి రైతు బాంధవుడనిపించుకున్నారు.

కానూరి వెంకటా చలపతయ్యగారు, ఆంగ్లభాషా పరిచయములేని అసలైన రైతు. రైతులలో ఆయన రాజకీయవేత్త, మహాపండితుడు. రైతులలో భావపరిణామమును కలిగించి వారిలో గొప్ప ఆందోళనను కలిగించినది ఆయనే. రైతు సమస్యలలో ఆయన ఆరి తేరినవాడు. ఆంధ్రదేశములో ఏసమస్య వచ్చినా ప్రభుత్వము వారికి ఏ రిపోర్టు యివ్వవలసి వచ్చినా ఆయన లేకుండా జరుగలేదు.

చలపతయ్యగారు పత్రికలకు వ్రాస్తూ, ప్రభుత్వానికి టెలిగ్రాములిస్తూ, రాయబారాలు జరుపుతూ అనేక విధాల అనవరతం రైతు సేవ జేసెను.

చలపతయ్యగారి తర్వాత చెప్పతగినవాడు వడ్డే శోభనాద్రిగారు. ఆయన

రైతుగా పుట్టాడు, రైతుగా పెరిగాడు, రైతుల అభివృద్ధికై పాటుపడ్తున్నాడు.

బల్లిపర్రులాకు నిర్మాణములో, పంటకాల్వలు, మురుగు కాల్వలు, పి. డబ్లియూ వారిచే త్రవ్వించటంలో, సరిగా నీరు సప్లై చేయించటంలో, డెల్టాపెంపులో ఆయన ప్రసిద్ధుడు.

మూడు టన్నుల క్లబ్బు ప్రెసిడెంటుగా; రైతు జనోపయోగ కార్యకలాపాల్లో ఆయన ప్రఖ్యాతుడు.

ఎక్కడ ఏ తగాదా వచ్చినా వెళ్ళి రాజీ చేయటంలో ఆయనకు ఆయనే సాటి.

ఆయనకు ఆంగ్లం రాదు. తెలుగుకూడా బాగా చదివినవాడు కాడు. కాని, నీతీ, నిజాయితి కలవాడు. ఆయన వేషభాషలు, రీతి రివాజులు అన్నీ అచ్చమైన రైతువే.

ఆ పూర్వకాలపు కలుపుకోలుతనము, పలుకరింపు, మర్యాద మన్నన అంతా పూర్వకాలపు రైతుదే. ఆయన చేసేపనంతా మేథ ద్వారా కాదు; హృదయముద్వారా ఆయన యీ కాలములో అరుదుగా కనిపించే వారిలో ఒకడు.

ఆయన్ని ఎరుగని వారుండరు. అలాగే ఆయన ఆంధ్రదేశంలో పెద్దలందరిని ఎరుగును.

శోభనాద్రిగారు గుడివాడ తాలూకా ఎలమర్రులో 1892న జన్మించాడు, ఈయన తండ్రి శ్రీరాములుగారు పెత్తందారు.

ఈయన ప్రథమంలో కానూరి చలపతయ్యగారితో ఎ.బి. క్లాసుల రద్దులో తిరిగాడు, ఆ కార్యం మోచర్ల రామచంద్రరావు గారి ద్వారా జరిగింది.

శోభనాద్రిగారు చేసిన ఘనకార్యాలలో సుస్పష్టంగా కనపడేది. బల్లిపర్రులాకు నిర్మాణము. ఈ లాకు కట్టడం వల్ల 70వేల ఎకరాలకు నీరు లభించింది. దీనికై ఆయన పడ్డ శ్రమ అధికము.

దీనికి మోచర్ల రామచంద్రరావుగారు సహాయపడ్డాడు. ఆయన రైతు

బంధువు. ప్రభుత్వంలో అధిక పలుకుబడి కలవాడు. జనపవిత్తులు కంట్రోలు ధరకు ఇవ్వకుండా బ్లాకు మార్కెట్ చేస్తున్నప్పుడు, బెజవాడలో ప్రభుత్వోద్యోగులను తీసుకొని పట్టించినందుకు ఆయనకు బహుమతిగా గడియారం ప్రభుత్వం వారిచ్చారు; రామస్వామి రెడ్డియారు ప్రధానమంత్రిగా వున్నప్పుడు.

అడ్వైజరీ పరిపాలనలో రైతు యిచ్చే వడ్లు, బియ్యం ఆడించి యిచ్చే యేర్పాటు చేశారు. మూడు టన్నుల క్లబ్బుకు ప్రెసిడెంటు. మన దేశం అచ్చంగా వ్యవసాయక దేశం. అయినా మనదేశపు పంట మనకు చాలదు.

ప్రభుత్వం దీనికి ఎన్నో ప్లానులు వేసింది. ఎంతో ప్రచారం చేసింది అధికోత్పత్తి పండించమని అన్నీ విఫలమైనవి.

"మన దేశపు వ్యవసాయములో మన్ను కన్న మనిషే ఎక్కువన్న సంగతి గమనించాలి. రైతుకు ఎక్కువ విజ్ఞానం కలిగించి అతని లోపం తీర్చే పూచీపడితే అధికోత్పత్తి చేయగలడు. ఏ మాదిరి అభివృద్ధికైనా వ్యవసాయమే పునాది కావాలి. కృషికి కృషీవలునికి లాభించనిదే దేశానికి ఏమీ లాభంలేద"ని అనుభవజ్ఞులగు శొంఠి రామమూర్తిగా రన్నారు. ఈ ధోరణిలో పనిచేసింది డాక్టరు చలంగారు.

"డాక్టర్ గూడూరి వెంకట చలం పేరు తెలుగు రైతు లోకంలో సుప్రసిద్ధమైంది. కడచిన ఏడెనిమిదేళ్ళలో ఆయన మన వ్యవసాయ రంగానికి ఒక వ్యక్తి ఒక జీవితకాలంలో చేయదగినంత సేవ చేశారు. రైతుల సమస్యలను, కష్టసుఖాలను పైనుంచి కర్ర పెత్తనం చెలాయించే ప్రభుత్వాధికారివలె కాక, వారిలో ఒకరుగా కలసి మెలసి అర్థం చేసుకుని పరిష్కారానికై కృషి చేశారు. తమ కార్యక్రమాలను ఏదో మొక్కుబడిగా చేస్తున్న ఉద్యోగ విధిగా కాక, తన వ్యక్తిత్వం ఆవిష్కారానికి, తన ఆత్మ వికాసానికి ఒక సాధనంగా పరిగణించి ఆయన పనిచేశారు. కనుకనే, ఆయనతో ఇటీవలే పరిచయం కలిగిన రైతులు సయితం డాక్టరు చలాన్ని తమ ఆత్మీయుడుగా భావించుకొనేవారు.

మన ఆహార సమస్యకు ప్రధాన పరిష్కార మార్గంగా హెచ్చు దిగుబడి విత్తనాలను గురించి ఇండియా ప్రభుత్వం ఆలోచిస్తున్న తొలి దశలోనే డాక్టర్ చలం తమ సహజోత్సాహంతో ఈ ప్రత్యేక రంగంలోకి దూకారు. ఈ రంగానికి ఆయన చేసిన సేవ అనుపమానం. మనిలా నుంచి తాను తెచ్చిన "తైచుంగ్ నేటివ్ -1" రకం వరి విత్తనం వ్యాప్తికి ఆయన ఎనలేని దోహదం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో "మూడు టన్నుల క్లబ్" పేరుతో అనధికార సంస్థను ప్రారంభింపజేసి, దానికి సాంకేతిక విషయాల సలహాదారుగా వుంటూ రైతులను స్వయంగా కలుసుకుని వారి సందేహాలను, "తైచుంగ్ నేటివ్ -1" విత్తనంపై కలిగిన అనుమానాలను, దాని బాగోగులపై జరిగిన వివాదాలను పరిష్కరించడానికి విసుగు విరతి లేని కృషి చేస్తూ, ఆయన తమ యావచ్ఛక్తిని మన వ్యవసాయాభివృద్ధికి ధారపోశారు. తన కృషి పట్ల బయలు దేరిన విమర్శనలను సరకు చేయక ఆయన చేసిన నిస్వార్థ సేవను ప్రత్యేకంగా సనదు పత్రంలో పత్రంలో పేర్కొంటూ ఇండియా ప్రభుత్వం డాక్టరు చలాన్ని కడచిన 1966 రిపబ్లిక్ దినోత్సవ సందర్భంలో "పద్మశ్రీ" బిరుదంతో గౌరవించింది."

**– *ఆంధ్రజ్యోతి సంపాదకీయము (9-5-1967)***

ఈ మూడు టన్నుల క్లబ్బుకి మన శోభనాద్రిగారు ప్రెసిడెంటుగా వుండట మెంతో గౌరవప్రదమైనది. ఆయన ఏపార్టీకి చెందని అచ్చమైన రైతై, రైతు అభివృద్ధికి తోడ్పటమే కారణం.

డాక్టర్ చలంగారికి చేదోడు వాదోడుగా వున్నారు. ఈ క్లబ్బు అభివృద్ధికై ఆయనెంతో పాటుపడ్డారు. విత్తుకొద్దీ మొక్క అన్నది ఈనాటిది కాదు. ఈ తైచుంగ్ నేటివు పరికరాల్లో పొట్టిది ఇది పడదు మన దేశవాళి వరి పైరువలె. ఎరువు భరించగలదు. నాలుగైదు పుట్లు యకరాకు పండింది. దేశమంతటా వ్యాప్తి గాంచింది.

ఈ తైచుంగ్ నేటివ్ పుట్టినవారింటి కంటే మెట్టినవారింటికే లక్ష్మిని తెచ్చింది. దేశమంతటా దీన్ని తండ్రిగాను, తల్లిగాను రూపొందించారు. జయ, పద్మ, హంస, కల్చరు 28. ఇది సంవత్సరానికి నాలుగు పంటలు పండించే

అవకాశం వున్నది. ఈ విధంగా పచ్చని విప్లవానికి (Green revolution) కారణం అయ్యింది.

ఈ క్లబ్బు ద్వారా విత్తనాలే కాదు. ఎరువులు వాడటం కూడా బాగా నేర్చుకున్నారు.

1963లో ఢిల్లీలో నేషనల్ సీడ్సు కార్పొరేషన్ స్థాపించబడింది. విజయవాడలో డాక్టరు చలం ఆలోచన ప్రకారమే బ్రాంచి స్థాపింపబడింది 1965 నవంబరులో.

ఈ మూడుటన్నుల క్లబ్బుకు ప్రెసిడెంటుగా శోభనాద్రిగారిని. అప్పటి ఆహారమంత్రి సి.సుబ్రహ్మణ్యంగా ఆహార కమిటీ సందర్భంలో ఢిల్లీకి పిలిపించారు. అప్పుడు ఆయన ఇలా చెప్పారు.

"నేను డెల్టా తెలుగు రైతును. నాకు ఇంగ్లీషు రాదు. ఇతర భాషలు రావు నాకు. రైతుకు కావలసింది పంటకాలవల మరమ్మతు, మురుగు కాలవలు త్రవ్వించటం, ఎరువుల సప్లై, రైతుకు న్యాయమైన ధర ఇవి చేస్తే మా ఆంధ్రదేశమే హిందూదేశానికి కావలసిన ధాన్యాన్ని సప్లై చేయగలదు" అనేసరికి ఆహార కమిటీ సభ్యులంతా నవ్వసాగారు. సుబ్రమ్మాణ్యంగారికి తెలుగు అర్థం అవుతుంది. ఆయన చెప్పమన్నాడు.



"ఆహార కమిటీ సభ్యులంతా మా ఆంధ్రదేశాన్ని చూడాలి. మా కృష్ణా గోదావరి ఆనకట్టలను దర్శించాలి. మాపంట పొలాలను చూడాలని నాకోర్కె" అని శోభనాద్రిగారు అన్నారు.

వారంతా వచ్చారు. అందులో ఒక బొంబాయి సభ్యుడు, ఆశ్చర్యపోయాడు గోదావరి చూచి. మాబొంబాయి దగ్గర ఇది చిన్న నది. ఇది యిక్కడ యింత గొప్పగా ప్రవహించటం ఆశ్చర్యంగా వున్నదన్నాడు.

తాడేపల్లి గూడెంలో మీటింగు జరిగింది. నేడు గవర్నమెంటు మురుగుకాల్వల కొరకు పన్ను వసూలు చేస్తున్నారు. అదెంతవరకు సక్రమంగా జరుగుతుందో! ప్రభుత్వం భోక్తల పక్షంకాని, ఉత్పత్తిదారుల పక్షంగాదు. మన సరిహద్దు రాష్ట్రాలగు మహారాష్ట్ర, మైసూరు ప్రభుత్వాలకన్న మన ఆంధ్రప్రదేశ్ బస్తారేటున

వడ్ల ధర తగ్గు. మన శాసనసభ్యులు అధికంగా రైతులే. అయితే వారికి ఆ గొడవ పట్టదు, రైతులలో ఐకమత్యం లేదు.

A nation gets the government what it deserves.

ప్రతి జాతికి తన స్థాయిని బట్టి ప్రభుత్వం వుంటుంది. రైతులలో జాగృతి కలిగించాలి శాసనసభ్యులు. వారు ఎన్నక సమయాల్లో తప్పితే మళ్ళీ కనిపించరు.

శోభనాద్రిగారి పిలుపులో ఆప్యాయత వున్నది. కలుపుగోలు తన మున్నది. అందరిని వరసతో పిలుస్తాడు. ఇది ఈనాడు అంతరిస్తున్నది.

ఎక్కడ తగాదా వున్నా తీసుకువెళ్తారు. అడగటం ఆలస్యం పద అంటాడు. అట్లాగే భార్యభర్తల తగాదాకు బయలుదేరతాడు. సాధ్యమైనంతవరకు సరిచేస్తాడు లేకపోతే విడాకు లిప్పించి, మళ్ళీ పెళ్ళి చేయిస్తాడు.

ఈ ధోరణి మనిషి లేడు యిప్పుడు. ఆయన జస్టీసు పార్టీలో వున్నాడు. పూర్వం. స్థానిక సంస్థలలోను పనిచేశాడు.

కాని కాంగ్రెసంటే అభిమానం-ఋణ పరిష్కారచట్టం చేసినప్పటి నుండి. ఆయన్ని నేను చాలాకాలం నుంచి యెరుగుదును. కాని బెజవాడలో 1966 నుంచి మైత్రి ఏర్పడింది. ఆయనకు 80 ఏళ్ళు, నాకు 72 యిప్పుడు. ఆయన్ని నేను మామగారంటాను, ఆయన నన్ను బావ అంటాడు. గారు శబ్దం ఆయన ఉపయోగించడు. మా అమ్మాయి శకుంతలగారింటికి తరుచు వస్తూ వుంటాడు.

ఏమి అమ్మాయ్, అంతా కులాసా? అంటాడు. అంతా బాగున్నాము మామయ్యా అంటుంది.

బావ వున్నాడా? అంటాడు. అందరిని పలకరించి వెళ్ళటం ఆప్యాయత. మమతలను పెంచుకోవటం, మానవత్వం. ఆయన ఆదిలో జస్టీసు పార్టీలో వున్నప్పటినుండి మంచి పేరున్నది.

ఆయనకు పదిమందీ బాగుపడాలని అపేక్ష తప్ప, మరొక కోర్కెలేదు. ఇటువంటి సత్పురుషులు అరుదు. ఆయన అంటే నాకు ఎనలేని అభిమానం, ప్రేమ.



వడ్డే శోభనాద్రిగారి చొరవతో పుల్లేరుపై నిర్మించబడిన బల్లిపర్రు లాకు



ఉయ్యూరు ఎ.జి.ఎస్.జి. సిద్ధార్థ కాలేజీలో నిర్మితమైన వడ్డే శోభనాద్రి
మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం